క్లుప్తంగా

నేడు మొక్కల పంపకం

చిత్తూరు కార్పొరేషన్: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు మొక్కలు నాటుతున్నట్లు ఎస్‌హెచ్ఏఐ పీడీ కార్తీక్‌రెడ్డి తెలిపారు. తల్లిపేరిట ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా పీఎం జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బంగారుపాళ్యం వెళ్లే మార్గం మహాసముద్రం వద్ద నాటుతారన్నారు. ఎంపీ, కలెక్టర్, జేసీ, డీఎఫ్ఓలు అతిథులుగా కార్యక్రమానికి రానున్నట్లు వివరించారు.

నేడు తులసి మొక్కల పంపిణీ

చిత్తూరు కార్పొరేషన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా నగరంలో తులసి మొక్కలు పంపిణీ చేయనున్నట్లు బీజేపీ నగర సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు చర్చివీధి జంక్షన్‌లో నగరవాసులకు 1000 మొక్కలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మొక్కలు తీసుకుని వాటిని నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు.

అనారోగ్యంతో రికార్డు అసిస్టెంట్ మృతి


మురళి(ఫైల్)

బంగారుపాళెం: బంగారుపాళెంలో నివాసం ఉంటున్న రికార్డు అసిస్టెంట్ మురళి(53) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఇతను బైరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ఈ నేపథ్యంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం మురళి భౌతికకాయాన్ని పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు సందర్శించి నివాళులు అర్పించారు. బంగారుపాళెం, బైరెడ్డిపల్లె మండలాల్లో అటెండర్‌గా, రికార్డు అసిస్టెంట్‌గా సేవలందించారని గుర్తుచేశారు.

ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్

చిత్తూరు కలెక్టరేట్: ప్రతి విద్యార్థి సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో జరిగిన విజయం డిగ్రీ కళాశాల 21వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక పోటీ ప్రపంచంలో ఉన్నత స్థానాన్ని చేరుకునేలా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని తెలిపారు. చైర్మన్ తేజోమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. అనంతరం పలు క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభం



పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నూతన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని సోమవారం ప్రారంభించారు. గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఆలయంలో వేకువజాము నుంచి హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


19 నుంచి 'మహాభారత యజ్ఞం'

సదుం: మండలంలోని భట్టువారిపల్లె భారతం మిట్ట కావమ్మ, మారయ్య ఆలయం వద్ద ఈ నెల 19 నుంచి మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి లక్ష్మిరెడ్డి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని 18 రోజుల పాటు నిర్వహిస్తామని, రోజూ మధ్యాహ్నం హరికథా కాలక్షేపం, రాత్రి నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

చౌడేపల్లెలో ఎంపీ పర్యటన

చౌడేపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సమావేశమవుతారని, అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎంపీ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

సీట్లు తగ్గితే చాలా నష్టపోతాం



మెడిసిన్‌పై ఎన్నో ఆశలతో చదువుతున్న నాలాంటి విద్యార్థులు ప్రభుత్వ నిర్ణయంతో చాలా నష్టపోతారు. నేను ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నాను. నాకు మునుపటి బ్యాచ్‌లో పలువురు డాక్టర్లు కావాలని వేలాది రూపాయలు నగదు, సమయం వెచ్చించి నీట్ కోచింగ్ తీసుకుంటున్నారు. వారిని నేను అనుసరించాలనుకున్నా. ఇప్పుడు ఎంబీబీఎస్ సీట్లు తగ్గితే ఇబ్బంది పడాల్సి వస్తుంది. మంచి ర్యాంక్ వచ్చినా సీటు వస్తుందో రాదోననే భయం ఉంది. మెడికల్ సీట్లు వద్దని రాసిన లేఖను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. **– వినయ్, అత్తూరు,**



ఆశలు అడియాశలవుతున్నాయి



ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్న పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతోంది. ప్రతి పేద విద్యార్థికి ఉన్నత విద్యను అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేయాలి. అయితే ప్రస్తుత ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసి పేద విద్యార్థుల ఆశలను అడియాశలు చేస్తోంది. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే వైద్య విద్యను కొనుక్కుని చదువుకునే పరిస్థితి పేద విద్యార్థులకు లేదు. – వాసు, నింద్ర

గణనాథుడికి సాంస్కృతిక నీరాజనం



భరతనాట్యం చేస్తున్న కళాకారులు

ఐరాల/తవణంపల్లె: కాణిపాకం శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి కళాకారులు భరతనాట్యం, భక్తి గీతాలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాలు చివరి రోజున రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల నుంచి విచ్చేసిన వేదపండితులచే వేదసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఈఓతో పాటు టీటీడీ ఆర్జేసీ ఎస్వీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వినాయకస్వామి సేవలో పలువురు ప్రముఖులు

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శాసనమండలి సభ్యులు శ్రీకాంత్, మాజీ మండలి కై కలూరు శాసన సభ్యులు కామినేని శ్రీనివాస్, ఆలయ పునఃనిర్మాణ దాతలు గుత్తికొండ శ్రీనివాస్‌రావ్, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ దర్శించుకున్నారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈఓ గురుప్రసాద్, ఆలయ మాజీ చైర్మన్లు మోహన్‌రెడ్డి, మణి నాయుడు, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.


పౌరాణిక నాటకంలో ఓ సన్నివేశం


భక్తి గీతాల ఆలపాన


స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఈఓ


కాణిపాకంలో వేదసభ నిర్వహిస్తున్న వేదపండితులు


నృత్యం చేస్తున్న కళాకారులు


కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధికారులు


కంకణాలను తొలగిస్తున్న అర్చకులు

వైభవంగా బకాసుర బలి బండి


తవణంపల్లెలో అట్టహాసంగా బకాసుర బలి బండి

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల దేవస్థానంలో జరుగుతున్న 119 ఏళ్ల మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా సోమవారం బకాసుర బలి బండి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ద్రౌపదీ దేవి, ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకుల, సహదేవల విగ్రహాలకు అర్చకులు అభిషేకం, పూజలు చేపట్టారు. అనంతరం బకాసురుడికి ఆహారం తీసుకురావడానికి ఏర్పాటు చేసిన బండిని అందంగా తీర్చిదిద్దారు. భీముడు వేషధారి మణి బండి అధిరోహించి తవణంపల్లె, ఎగువతవణంపల్లె, మిట్టపల్లె, గోనేపల్లె, కక్కల మిట్ట తదితర గ్రామాల్లో బండిలో తిరిగి ఆహారాన్ని సేకరించారు.

ఆకట్టుకున్న హరికథా గానం..

మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం భాగవతారిణి స్వర్ణలత బకాసుర వధ గురించి గానం చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధికసంఖ్యలో పాల్గొని హరికథను శ్రద్ధగా విన్నారు. అనంతరం దాతలచే గుడికి విరాళంగా ఇచ్చిన బండిన అందంగా తయారుచేసిన కోదండ ఆచారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.


హరికథా గానం చేస్తున్న భాగవతారిణి స్వర్ణలత

ధ్వజావరోహణంతో ముగిసిన ఉత్సవాలు

- శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం
- వేడుకగా వసంతోత్సవం, ఏకాంతసేవ

ఐరాల/తవణంపల్లె: కాణిపాకం పుణ్యక్షేత్రం సోమవారం ఎటు చూసినా ఆధ్యాత్మికతను సంతరించుకుంది. స్వయంభు శ్రీ వినాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల చివరి రోజు పలు సేవలు ఆద్యంతం శోభను సంతరించుకున్నాయి. ఉదయం త్రిశూల స్నానం సందర్భంగా భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి పునీతులయ్యారు. అనంతరం వసంతోత్సవం, సాయంత్రం ధ్వజావరోహణం, యాగశాలలో ముగింపు పూజలు, రాత్రి వడాయత్తు ఉత్సవం, ఏకాంత సేవ కార్యక్రమాలు నయనానందకరంగా సాగాయి. స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ నవరాత్రి ఉత్సవాలు సోమవారం ధ్వజావరోహణంతో వైభవంగా ముగిశాయి. ఉదయం ఆలయ పుష్కరిణిలో త్రిశూలానికి శాస్త్రోక్తంగా పవిత్ర స్నానం చేయించారు. ముందుగా మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ సిద్ధి, బుద్ధి, సమేత శ్రీవినాయకస్వామి ఉత్సవమూర్తులను, త్రిశూలాన్ని పురవీధుల్లో ఊరేగించి పుష్కరిణి వద్దకు చేరుకున్నారు. యాగశాలలో ఏర్పాటు చేసిన 108 కలశాలలోని తీర్థాలను పుష్కరిణిలో కలిపారు. అనంతరం త్రిశూలానికి పవిత్ర స్నానం చేయించారు. విచ్చేసిన భక్తజనం పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమున దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు రంగు నీళ్ల చల్లుకుంటూ కోలాహలంగా ఊరేగించారు. తదుపరి యాగశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పర్యవేక్షణ యాగమూర్తికి భక్తితో ముగింపు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో ప్రధాన సూత్రధారులుగా చేస్తూ ఎమ్మెల్యే మురళీమోహన్, ఈఓ గురుప్రసాద్‌కు కట్టిన రక్ష బంధనాలను అర్చకులు శాస్త్రోక్తంగా తొలగించారు. సాయంత్రం ధ్వజావరోహణంలో భాగంగా ఆలయంలోని స్వర్ణ ధ్వజస్తంభానికి అభిషేక పూజలు నిర్వహించారు. భక్తితో దీపధూప నైవేద్యాలు సమర్పించారు. ధ్వజస్తంభంపై నుంచి మూషక చిత్రపటాన్ని శాస్త్రోక్తంగా అవరోహణ చేశారు.

నేత్రనందంగా వడాయత్తు ఉత్సవం

సోమవారం రాత్రి స్వామివారికి వడాయత్తు ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. స్వామివారి మూలవిగ్రహానికి భక్తితో అభిషేకం నిర్వహించి, పెసర పప్పు పాయసం, ఉద్ది వడలు నైవేద్యంగా సమర్పించి వడాయత్తు ఉత్సవాన్ని అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ సేవ స్వామివారికి అత్యంత ప్రీతి పాత్రమైందని పురాణాలు చెబుతున్నాయి. అనంతరం స్వామివారికి ఏకాంత సేవను నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణ నిర్వహించి పాలు, పండ్లు నైవేద్యంగా సమర్పించి మంగళ హారతులు ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో అలసిన స్వామివారికి ఏకాంత సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈఓ గురుప్రసాద్, ఏఈఓలు, సూపరింటెండెంట్‌లు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

రామకుప్పం: మండలకేంద్రానికి సమీపంలోని సుబ్బరాయుని తోపులో ఏడు శిరస్సుల నాగుపాము ఆకారంలో వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సుబ్రమణ్యస్వామి వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నుంచి స్వామి అమ్మవార్ల దర్శనానికి భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, అలంకరణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. నాగులపుట్టలో పాలు పోసి భక్తులు మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలోని శనీశ్వర స్వామి, నాగుల ముద్దమ్మ, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం స్వామివారికి కావడులు చెల్లించారు. వల్లీదేవసమేతుడై సుబ్రమణ్యస్వామి మయూర వాహనంపై ఊరేగారు. ప్రాకారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయం పరిసర ప్రాంతాల్లో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ భక్తులకు ఉచిత అన్నప్రసాదాలను పంపిణీ చేసింది.


ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్

తవణంపల్లె: మండలంలో అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ చిరంజీవి హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఎగువమత్యంకు చెందిన ప్రజ్వల్ అనే అతను అధికారుల అనుమతి లేకుండా వంకలోని ఇసుకను ట్రాక్టర్‌కు లోడు చేసి తరలిస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన రీచ్‌ల్లో మాత్రమే ఇసుకను తరలించాలని సూచించారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్వాధీనం చేసుకుని ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

- త్రుటిలో తప్పిన ప్రమాదం


లారీ ఢీకొనడంతో విరిగిన విద్యుత్ స్తంభం

బైరెడ్డిపల్లె: బస్సును తప్పించే యత్నంలో అదుపు తప్పి లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సంఘటన ఆదివారం అర్ధరాత్రి బైరెడ్డిపల్లెలో చోటుచేసుకుంది. వివరాలు.. తమిళనాడు రాష్ట్రం మదురై పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ ఆనంద్ ఆళ్లగడ్డ నుంచి మదురైకు సిమెంటు లోడుతో వెళ్తుండగా స్థానిక మెయిన్‌రోడ్డు సెంటర్ బస్టాండ్ వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది సోమవారం ఉదయం దెబ్బతిన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి, దాని స్థానంలో మరో స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లు లాగి సాయంత్రం వేళకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అప్పటివరకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సుంకం పెంపుతో వంటనూనె ధరలకు రెక్కలు


ఆయిల్ ప్యాకెట్లు

చిత్తూరు కలెక్టరేట్: వంట నూనెల దిగుమతిపై 20 శాతం సుంకాన్ని పెంచుతూ కేంద్రం ఈ నెల 14వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయగానే వ్యాపారులు అప్పుడే మార్కెట్‌లో నూనె ధరలు అమాంతం పెంచేశారు. శుక్రవారం వరకు ఉన్న నూనె ధరను లీటర్‌కు రూ.10 పెంచేశారు. పామాయిల్ రూ.95 ఉన్న దాన్ని రూ.106కి పెంచారు. రిఫైండ్ ఆయిల్ రూ.106 ఉంటే రూ.116కి పెంచేశారు. అలాగే వేరుశనగ నూనె రూ.150 నుంచి రూ.160కు పెంచారు. దిగుమతి సుంకం అమల్లోకి వస్తే లీటర్‌కు అదనంగా రూ.20 వరకు పెరగనుంది. కొంతమంది వ్యాపారులైతే నూనెల ధరలు మరింత పెరుగుతాయని బ్లాక్ చేసినట్లు సమాచారం. సామాన్యుడి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న తరుణంలో ఇప్పటికే ఉల్లి ధరలు పెరగడంతో అవస్థలు పడుతున్నారు. వాటికి తోడు నూనె ధరలు పెరగడం వల్ల ప్రజలు మరింత ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోనున్నారు. జిల్లాలో వంట నూనెలు విక్రయించే హోల్‌సేల్, దుకాణాలు వెయ్యికి పైగా ఉన్నాయి. వాటిలో రోజుకు 17 వేల లీటర్ల వరకు పామాయిల్, రిఫైండ్ ఆయిల్, వేరుశనగ నూనె విక్రయాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన నెలకు 6 లక్షల లీటర్ల వరకు వినియోగం కాగా నెలకు రూ.7 కోట్ల నుంచి రూ.7.50 కోట్ల వరకు నూనెలకు సంబంధించి లావాదేవీలు జరుగుతున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అధిక ధరలకు నూనెలు విక్రయించకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ జయరామయ్య కథనం మేరకు.. కొండమిట్ట, టాప్‌లైన్ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టారు. సంతపేటకు చెందిన అక్బర్ (32), చామంతిపురానికి చెందిన రామ్మూర్తి (55) అనే ఇద్దరి వద్ద రెండు ప్యాకెట్లు లభించగా వాటిని తెరచి చూశారు. ఇందులో రెండు కిలోల బరువు ఉన్న గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి, న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండుకు ఆదేశించారు. దీంతో వీళ్లను చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

ఘనంగా రాహుకేతు పూజలు


మొగిలి శివాలయంలో రాహుకేతు పూజలు చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వారిచే భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

బ్రిడ్జి ఇలా.. ప్రయాణం ఎలా !

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని ఓవర్‌బ్రిడ్జి గుంతలతో నిండిపోయింది. అడుగుకు ఒక గుంత దర్శనమిస్తోంది. దీంతో వాహనాదారులు ప్రయాణించాలంటే ఇబ్బంది పడుతున్నారు. గుంతలు పడినప్పుడు నిర్వహణలో భాగంగా కాంట్రాక్టర్ వాటికి మరమ్మతులు చేయడం లేదు. ఇటువైపు నిత్యం భారీ వాహనాలు, బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వేలసంఖ్యలో ప్రయాణిస్తుంటాయి. ప్రయాణ సమయంలో గుంతల బారిన పడి పలువురు గాయాలపాలై ఆస్పత్రులకు వెళ్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


గుంతలు పడిన ఓవర్‌బ్రిడ్జి